నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 07, 2024 | www.navatelangana.com
1

## రేషన్ సరుకులు ఇవ్వలేదని దుకాణానికి తాళం

**కెరమెరి :** జనవరి నెల సంబంధించిన రేషన్ సరుకులు ఇవ్వలేదని రేషన్ దుకాణానికి తాళం వేసిన సంఘటన మంగళవారం మండలంలోని ముకధంగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం రేషన్ డీలర్ బుద్ధగయ పుండలిక్ వాగ్మారే జనవరి సరుకులు రాలేదని గ్రామస్తులకు తెలిపారు. జనవరికి సంబంధించిన సరుకులు అందజేస్తేనే రేషన్ దుకాణం తాళం తెరుస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పేద ప్రజలకు రేషన్ సరుకులు అందించడలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. రేషన్ దుకాణానికి తాళం వేసిన వారిలో మాజీ సర్పంచ్ పతంగే లింబాదాస్, గ్రామస్తులు బాలాజీ, సాహెబ్‌రావు, విశాల్, అశోక్, మోహన్ తదితరులున్నారు.



## ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జెడ్పిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు గోపాల్ నాయక్, గుండా వెంకన్న, చౌదరి గోపాల్, ప్రసాద్‌గౌడ్, జీవన్, కుమార్ ఉన్నారు.



## మతిభ్రమించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధికారం పోయిందని బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫ్లెక్సీని సోమవారం తెలంగాణ చౌక్‌లో దహనం చేశారు. ఖబడ్దార్ బాల్క సుమన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చరణ్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచితంగా మాట్లాడిన సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరువీరుల కుటుంబాల గురించి, ఓయూ క్యాంప్‌ను ఎప్పుడు కూడా సందర్శించలేని సుమన్ నేడు సీఎంపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు తిరగనివ్వరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇసాక్ షేరూ, నహిద్, భూపెల్లి శ్రీధర్, రూపేష్ రెడ్డి, మోసిన్ పటేల్, అర్బాత్ పాల్గొన్నారు.

## బాధితులకు అండగా భరోసా కేంద్రం

నవతెలంగాణ-నస్పూర్

లైంగిక దాడులకు గురైన మహిళలు, బాలబాలికలకు భరోసా, రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భరోసా కేంద్రాల ఏర్పాటులో భాగంగా మంగళవారం మంచిర్యాల జోన్ పరిధిలో సీసీసీ నస్పూర్‌లో ఉమెన్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని డీజీపీ రవి గుప్తా అడిషనల్ డీజీపీలు షికా గోయల్, మహేష్ భగత్‌తో కలిసి వర్చువల్ ద్వారా జనగాంలో ప్రారంభించారు. అనంతరం మంచిర్యాల జోన్ ఏసీపీలు, పోలీసు అధికారులతో కలిసి శిలా ఫలకాన్ని ప్రారంభించారు. భరోసా కేంద్రం లైంగిక దాడులకు గురైన బాధితులకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఇందులో భాగంగానే బాధితులకు న్యాయపరమైన సహకారంతో పాటు వైద్య సహకారాన్ని అందించబడుతుందని తెలిపారు. వీటితో పాటు బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, జైపూర్ ఏసీపీ మోహన్, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య పాల్గొన్నారు.

## పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

దివంగత వెంకటస్వామి స్మారకార్థకంగా పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, తనయుడు గడ్డం వంశీ ప్రారంభించారు. కాకా చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి కాసేపు సరదాగా బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 'ఎంపీ స్థానం కైవసం చేసుకుందాం'

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కార్యకర్తలు కలిసి కట్టుగా వుండి ఎంపి స్థానం కైవసం చేసుకుందామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం స్థానిక కాగ్నే ఫంక్షన్ హాలులో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక లాంటి వారన్నారు. మండల కార్యకర్తలు విభేదాలు విడనాడి పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ.మసూద్ మాట్లాడుతూ కొందరు కార్యకర్తలు ఎన్నికల్లో భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు చర్చించుకుంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో పార్టీకి చెడ్డపేరు వస్తుందన్నారు. ఎన్నికల్లో అవినీతికి పాల్పడిన కార్యకర్తలపై ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు సోమురే నాగోరావ్, ఇంద్రాబాయి, ఎండీ.జహీర్, కొమురయ్య పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థికసాయం

నవతెలంగాణ-భైంసా

మండలంలోని హజ్గుల్ గ్రామానికి చెందిన వృద్ధురాలు కదం ఆనందబాయి ఇల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోవడంతో బాధితురాలికి బిజెపి నియోజకవర్గ నాయకులు శివాజీ పటేల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తరపున ఆర్థిక సాయం అందించారు. ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ సర్పంచులు ప్రకాష్ పటేల్, రాము, హన్మండ్లు, నాయకులు భీమినేని శంకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రాథమిక మెరిట్ జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి

నవతెలంగాణ-నస్పూర్


తెలంగాణ వైద్య విధాన పరిషత్-జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయం పరిధిలో ఒప్పంద పద్ధతిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన ప్రాథమిక మెరిట్ జాబితాను ప్రదర్శనకు ఉంచామని, అభ్యర్థులకు ఏమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే రాత పూర్వకంగా తెలియజేయాలని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు ఎం.కోటేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో, జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం నోటీసు బోర్డుపై ఉంచామని తెలిపారు. అభ్యర్థులకు ఏమైన అభ్యంతరాలుంటే ఫిబ్రవరి 7 నుండి 9 వరకు ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 5గంటల లోగా కార్యాలయ పనివేళలలో రాత పూర్వకంగా తెలియజేయాలని తెలిపారు.

## గోపాల్‌నగర్ పంచాయతీని పర్యవేక్షించిన తహసీల్దార్

**తాండూర్:** అచలాపూర్, గోపాల్‌నగర్ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్ రోహిత్ మంగళవారం గోపాల్ నగర్ పంచాయతీని సందర్శించారు. నర్సరీ, పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కార్యదర్శి వసంతకు పలు సూచనలు చేశారు. తాండూర్ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తాండూర్ పంచాయతీని పర్యవేక్షించారు. మాదారం స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్ పంచాయతీలోని అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట కార్యదర్శి సౌందర్య ఉన్నారు. ఎంపీఓ సత్యనారాయణ ద్వారకాపూర్ పంచాయతీని సందర్శించారు.

# రిమ్స్‌లో అందనున్న మెరుగైన వైద్యం..!

- జిల్లాకు 164 మంది స్టాఫ్ నర్సుల కేటాయింపు
- డైరెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ విధుల్లో చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మారుమూల ప్రాంతంగా పేరొందిన ఆదిలాబాద్‌లో రిమ్స్‌లో ఇక నుంచి మెరుగైన వైద్యం అందనుంది. ఇటీవల నర్సింగ్ అధికారుల నియమాకాల్లో భాగంగా రిమ్స్‌కు పెద్ద ఎత్తున నర్సులను కేటాయించారు. వారు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు రిపోర్టు చేసి విధుల్లో చేరుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలో భాగంగా గత ఆగస్టు నెలలో నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు పరీక్షలు నిర్వహించారు. డిసెంబర్‌లో ఫలితాలను వెలువరించి, మెరిట్ ప్రాతిపదికన జనవరి 31న నియామక పత్రాలు అందించారు. ఇందులో 164 మంది నర్సింగ్ అధికారులను ఆదిలాబాద్‌కు కేటాయించారు.

**త్వరలో వైద్యుల పోస్టులు భర్తీ**

స్టాఫ్ నర్సులు సోమవారం నుంచి రిమ్స్‌లో రిపోర్టు చేస్తున్నారు. ఇప్పటి వరకు 120 మంది నర్సింగ్ అధికారులు రిపోర్ట్ చేసినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. పాత వారిని కలుపొని ప్రస్తుతం మూడు వందలకుపైగా నర్సింగ్ స్టాఫ్ ఉన్నట్టు పేర్కొన్నారు. సిబ్బంది పూర్తి స్థాయిలో భర్తీ కావడంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందే అవకాశం ఉందన్నారు. అదే విధంగా ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చామని, వైద్యులు కూడా ఇక్కడి రావాడానికి సుముఖంగా ఉన్నారని తెలిపారు. త్వరలోనే వాటిని భర్తీ చేస్తామని డైరెక్టర్ స్పష్టం చేశారు.

# గనిపై మల్టీ డిపార్ట్మెంటల్ కమిటీ సమావేశం

నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిలో మల్టీ డిపార్ట్మెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. మందమర్రి జీఎం, కమిటీ చైర్మన్ మనోహర్, ఎస్ఓ టూ జీఎం, కన్వీనర్ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కంపెనీ ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సాధించిన విషయాలను, భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులలో యంత్రాల వినియోగం, సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ, ఆర్థిక విషయాలపై చర్చించారు. భవిష్యత్తు ప్రణాళికలు, కంపెనీ ముందున్న సవాళ్లను, లక్ష్యాలను సాధించడానికి చేయాల్సిన పనులపై చర్చించారు. గని ఉద్యోగస్తులు కంపెనీ సూచించిన సలహాలు, సూచనలు పాటించడం వల్ల ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతుందని, అందరూ నిబద్ధతతో తమకు కేటాయించిన పనులను చేయడం వల్ల లక్ష్యాలను చేరడానికి సులువవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, సీఎంవోఏఐ అధ్యక్షులు పైడిశ్వర్, ఏజీఎం నాగరాజు, డీజీఎంలు ఆర్వీఎస్కే ప్రసాద్, రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, సేఫ్టీ ఆఫీసర్ సునీల్, ఉద్యోగులు పాల్గొన్నారు.



**నస్పూర్ :** బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత పెంచేందుకు మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఓ టు జి ఎం రఘు కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్ఆర్పి 1 గనిలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గనులలో ఉత్పత్తి ఉత్పాదకత పెంచి లక్ష్యాలను అధిగమించడం, నాణ్యత ప్రమాణాల పెంపు, సంక్షేమం అంశాలపైన ప్రణాళికలను రూపొందించి ముందుకు సాగాలని సూచించారు. అలాగే రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, డిజిఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఏఎస్ఓ శ్రీధర్‌రావు, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, ఎస్ఆర్పి-1 మేనేజర్ విజయ్ కుమార్, ఎస్ఈ ఐఈడి కిరణ్‌కుమార్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, గని అధికారులు - సేఫ్టీ ఆఫీసర్ చంద్ర ముర్ము, పిట్ ఇంజనీర్ శంకరయ్య, అండర్ మేనేజర్లు మోహన్‌రెడ్డి, నరేష్, వెల్ఫేర్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-హాజీపూర్

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోట రవి మాట్లాడుతూ సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేనిపక్షంలో జిల్లాలో తిరుగనివ్వబోమని హెచ్చరించారు. మదంతో మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ ప్రజలే బాల్క సుమన్‌ను తరిమికొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీలు ఒడ్డె బాలరాజు, డేగ బాపు, పస్కూరి శ్రీనివాస్‌రావు, ముత్తె నగేష్, సతీష్‌రావు, సంజయ్‌రావు, బొడ్డు శంకర్, నైకని సురేందర్, చింతపండు శ్రీనివాస్, ఓ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నస్పూర్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ముందుగా సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి గాడిదపై ఊరేగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, నాయకులు తాళ్ల సంపత్‌రెడ్డి, గెల్లు మల్లేష్ పాల్గొన్నారు.



**కాసిపేట :** కాంగ్రెస్ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మను శవ యాత్ర నిర్వహించి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్క సుమన్ అధికార పార్టీలో ఉన్నట్టు భ్రమలో ఉండి బలుపు ప్రదర్శన చేయడం సరైన చర్య కాదని, ఇదే బలుపు కొనసాగితే త్వరలో కాంగ్రెస్ కార్యకర్తలు దేహ శుద్ధి చేయడం తప్పదని పేర్కొన్నారు.

**దస్తురాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గం మల్లేష్ మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఓటమిని తట్టుకోలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, సుమన్ వెంటనే క్షమాపణలు చెప్పి మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పుల్యానాయక్, వెంకటేష్, మునేసుల రాజన్న, గోపి, ప్రసాద్, నరేష్ నాగరాజ్, శ్రీను, రవి, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ -ఆదిలాబాద్ అర్బన్

ప్రస్తుత పార్లమెంటు సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని టిఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మాల్యాల మనోజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈ పార్లమెంటు సమావేశం చివరిదైనందున ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. తమది 30 సంవత్సరాల సుదీర్ఘమైన న్యాయమైన డిమాండ్ అని పేర్కొన్నారు. ఎస్సీ వరకరణ బిల్లు విషయంలో సుప్రీంకోర్టులో ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ముందు వర్గీకరణ హియరింగ్ ప్రారంభమైందని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు కేంద్రం వర్గీకరణ విషయంలో కట్టుబడి ఉండాలని కోరారు. మోడీ ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాలలోనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి ప్రభుత్వానికి మాదిగ ఉపకులాల తరపున తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. అలాగే 8 నుండి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో బడ్జెట్ ప్రవేశ పెడుతున్న సందర్భంగా గత ప్రభుత్వంలో మాదిరిగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. అంబేద్కర్ అభయహస్తం పథకానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించి తక్షణమే ఈ పథకం అమలులోకి వచ్చేలా చూడాలని సీఎంను కోరారు. ఈ సమావేశంలో టిఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్, కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తార రవికుమార్, ఉపాధ్యక్షుడు కత్తి గంగాధర్, నాయకులు చొప్పదండి భూమన్న, కల్లేపల్లి మల్లేష్, బట్టు మహేందర్ పాల్గొన్నారు.




## గ్రంథాలయాల అభివృద్ధి దిశగా చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి అంచనాలు, పద్దుల వారీగా నికర ఖర్చులతో పాటు 2024-25 సంవత్సరానికి సమగ్ర అంచనా బడ్జెట్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుండి గ్రంథాలయ సంస్థకు చెల్లించవలసిన సెస్సును చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో పాఠకులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, ఇతర మెటీరియల్ అందుబాటులో ఉంచాలని, గ్రామపంచాయతీలలో అవసరం మేరకు పబ్లిక్ రీడింగ్ రూమ్, వసతి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని దండేపల్లి మండల కేంద్రంలో నూతన శాఖ గ్రంథాలయం కొరకు రూ.30లక్షలు, వేమనపల్లి మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయ భవనానికి ప్రహరీగోడ, మరుగుదొడ్ల నిర్మాణం కొరకు రూ.12.50లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా వయోజన విద్య అధికారి పురుషోత్తం నాయక్, జిల్లా విద్యాశాఖ సెక్టార్ అధికారి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎవియన్. రాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు, జాతీయ విపత్తులపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-తాండూర్

వరదలు, భూకంపాల వంటి జాతీయ విపత్తులు సంభవించినప్పుడు ప్రతి వ్యక్తి ఒక సైనికుడిలా వ్యవహరించాలని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ పదో బెటాలియన్ కమాండర్ బిటాన్ సింగ్ అన్నారు. మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందితో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తులు సంభవించినప్పుడు తమను తాము కాపాడుకుంటూనే సేవా స్ఫూర్తితో ఇతరులకు సహకరించాలని తెలిపారు. విద్యార్థులకు ప్రయోగ పద్ధతిలో వివరించారు. వర్షాకాలంలో వరదలు, ముంపు ఉధృతమైనప్పుడు సంరక్షణ పద్ధతులను తెలిపారు. ఈమధ్య కాలంలో ఎక్కువ మంది గుండెపోటుతో మరణించడం జరుగుతోందని, గుండెపోటు వచ్చినప్పుడు రక్షించే విధానాన్ని నేర్పించారు. ప్రతి ఒక్కరు తీరిక సమయాల్లో వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్, ఎస్సై రాజశేఖర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మండల విద్యాధికారి ప్రభాకర్‌రావు, విద్యా భారతి కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్, ఆర్ఐ మురళీధర్‌రావు, ఎంపీఓ సత్యనారాయణ, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'యువతకు కాంగ్రెస్ మంచి అవకాశాలిస్తోంది'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువతకు కాంగ్రెస్ మంచి అవకాశాలు ఇస్తోందని, కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇసాక్ షేరూ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో యూత్ కాంగ్రెస్ పరిస్థితులను నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సీనియర్ నాయకులు తమకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని యూత్ సభ్యులు తెలిపారు. దీనిపై పార్టీ సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇసాక్ షేరూ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి ప్రతి యూత్ కాంగ్రెస్ నాయకుడు కృషి చేయాలన్నారు. కొంత మంది సీనియర్లు తమను గుర్తించడం లేదని ఆవేదన చెందాల్సిన అవసరం లేదని, పార్టీలో పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చరణ్‌గౌడ్, నహిద్, రూరేష్‌రెడ్డి, మోసిన్ పటేల్, అర్బాత్ పాల్గొన్నారు.

## గ్రీన్‌వుడ్ పాఠశాలపై క్రిమినల్ కేసు హర్షణీయం

నవతెలంగాణ-నస్పూర్

సీబీఎస్ఈ పేరుతో విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్న గ్రీన్‌వుడ్ పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయడం హర్షణీయమని బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిర్ రాజేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గద్దరాగాడి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోగల గ్రీన్ వుడ్ పాఠశాల యజమాన్యం అనుమతులు లేకుండానే సిబిఎస్ఈ సిలబస్ పేరిట విద్యార్థులను అడ్మిట్ చేసుకొని స్టేట్ సిలబస్ బోధిస్తూ లక్షల రూపాయల ఫీజుల రూపంలో వసూలు చేశారని తెలిపారు. విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో ఆర్జెడి స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. క్రిమినల్ కేసుతో పాటు గ్రీన్‌వుడ్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## జాతీయస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థికి రెండో స్థానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆంధ్రప్రదేశ్‌లోని చీరాలలో నిర్వహించిన జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి తన ప్రతిభను చాటి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచాడు. కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సెహ్వాగ్ ఇటీవల జరిగిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. షూటింగ్ బాల్ పోటీల్లో రాష్ట్రంలో రెండో స్థానం నిలవడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విద్యార్థికి ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అనిత, అధ్యాపకులు రఘునాథ్, సంతోష్ కుమార్, రమేశ్, నర్సింగరావు, జ్యోత్స్న, తిరుపతి, రాజ్ కుమార్ ఉన్నారు.

## రమాబాయి జయంతి కరపత్రాల విడుదల

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు మాత రమాబాయి అంబేద్కర్ జయంతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ బుధవారం జిల్లా కేంద్రంలో కైలాస్‌నగర్ బుద్ధ విహార్‌లో నిర్వహించబడే మాత రమాబాయి అంబేద్కర్ 126వ జయంతి కార్యక్రమానికి బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు సంతోష్ మానే, కాంబ్లే ప్రజ్ఞశిల్, ఆడే సుభాష్, చాలుర్కర్ పుండలీక్, ధుత్ రాజ్ మధుకర్, దుర్గే కేశవ్ ఉన్నారు.

# గ్రామీణ బంద్, సమ్మె వాల్ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలపై పోరాటంగా ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త గ్రామీణ బంద్ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు కావస్తున్న ప్రజలకు కార్మికులకు కర్షకులకు ఉపయోగపడే ఒక పని చేయలేదని అన్నారు. వీరందరిపై భారాలు మోపే విధంగా హక్కులను కాలరాసే విధంగా చట్టాలను విధానాలను రూపొందింస్తూ అమలు చేస్తుందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ప్రయివేట్ శక్తులకు అప్పనంగా అమ్మేస్తుందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని చెప్పి ఉన్న భూములను కంపెనీలకు అప్పజెప్పే కుట్రలను పన్నిందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని, భారతదేశ కార్మిక వర్గం అనేక పోరాటాల ద్వారా త్యాగాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కును సమ్మె చేసే హక్కును దూరం చేసిందని అన్నారు. కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, 4 లేబర్ కోడ్స్, ఎన్ఈపీ చట్టం, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, కాల పరిమితి మిగిలిన అన్ని షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ల కనీస వేతనాల జీఓలను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. 2021లో విడుదల చేసిన 5 కనీస వేతనాల జీఓలను వెంటనే గెజిట్ చేసి, అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం, ప్రయివేట్‌పరం చేయడం ఆపాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి ఉద్యోగ, కార్మికుల్ని పర్మినెంట్ చేయాలన్నారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలన్నారు. కేంద్ర స్కీంలకు బడ్జెట్ తగ్గించోవద్దని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలు చెల్లించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత పథకాన్ని ప్రవేశపెట్టాలని, అన్ని రకాల ఆహార వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించాలన్నారు. కనీస పెన్షన్ రూ.10వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. మతోన్మాద విధానాలతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను, మతోన్మాద విధానాలను నిరసిస్తూ చేపడుతున్న గ్రామీణ బంద్ సమ్మెను ప్రజలు కార్మికులు కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి దత్తాత్రి, దేవర్ల స్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గంగన్న, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సురేందర్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు దర్శనాల నగేష్, సీఐటీయూ జిల్లా నాయకులు రమకాంత్, దశాంత్, రవీందర్ పాల్గొన్నారు.

**తాంసి :** ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న పిలుపునిచ్చారు. మంగళవారం భీంపూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశ మధ్యాహ్నం భోజన కార్మికులతో కలిసి సమ్మె వాల్ పోస్టర్‌లను విడుదల చేసి సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ రైతాంగ కార్మికవర్గ సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో కార్మిక రైతు వర్గాన్ని మోసం చేయడమే తప్ప ఏమి సాధించలేదన్నారు. నిజ వేతనాలు 20శాతం తగ్గిపోయాయని అన్నారు. ప్రపంచంలోని 125 దేశాల్లో ఆకలిలో భారతదేశం 11వ స్థానంలో ఉందన్నారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ఈ ప్రభుత్వం తెచ్చిందని అన్నారు. ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్ సమ్మెను అన్ని వర్గాలకు చెందిన వారు విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు తులసి భాయి, అంగన్‌వాడీ సిబ్బంది సుజాత, ప్రియ, ముక్త, ఆశ వర్కర్లు స్వప్న, సుజాత, ధృపద ఉన్నారు.

## రోడ్డు రవాణా భద్రతపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

జాతీయ రోడ్డు రవాణా భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కాల్వ గ్రామంలో ఎస్సై యాసిన్ అరాఫత్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరి ధరించాలని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమన్నారు. మైనర్ బాల, బాలికలకు వాహనాలు ఇవ్వరాదని పేర్కొన్నారు. వాహనాలు నడిపే సమయంలో మొబైల్ ఫోన్ మాట్లాడరాదని సూచించారు. ముగ్గురు వ్యక్తులతో డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, వాహనం పరిమితికి మించి వేగంతో నడపరాదని అన్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి డాక్టర్ రాకేష్ వివరించారు. మాజీ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్ వాహనదారులకు పది హెల్మెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జాదవ్ బాబురావు, కాల్వ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ చైర్మెన్ ఉజారం మహేష్, ఎట శ్రవంతి పాల్గొన్నారు.

## బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-కడెం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఓటమిని తట్టుకోలేక ఇలాంటి అసభ్యకరమైన మాటలకి పాలపడుతున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పి మాటలని వెనక్కి తీసుకోవాలని అన్నారు. లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట్ ఎంపీటీసీ కట్ల సింధుజ సాగర్, కొత్త మద్దిపడగ మాజీ సర్పంచ్ జాడ ఇందూర్ రాజమణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వాజీద్‌ఖాన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్ వర్మ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తరి శంకర్, నాయకులు షేక్ రఫిక్, బబ్లు, రహీమ్, పడిగెల రాజు, రెంకల రాజన్న, కుమార్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

**ఖానాపూర్ :** ఖానాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మంగళవారం ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దిష్టిబొమ్మ దహనం అనంతరం నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి బాల్క సుమన్‌కు లేదని అన్నారు. నోటికి వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో బాల్క సుమన్‌పై కేసు నమోదు చేయాలని మండల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షబీర్ పాష, కౌన్సిలర్ రజూర సత్యం, నాయకులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించేందుకు కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాయిరాం కాలనీలో మార్నింగ్‌వాక్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తూ, ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనివాసులతో పాటు ఆత్రం మహేష్, ఆత్రం ఉపేందర్, మాడవి శంకర్ ఉన్నారు.

## కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ఆడబిడ్డల పెండ్లిలకు కళ్యాణలక్ష్మీ పథకం ఒక వరం లాంటిదన్నారు. ఈ సందర్భంగా సుమారు 42 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు, మసూద్ పాల్గొన్నారు.

## నాగోబా జాతర పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్
- భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలి
- జాతర ముగింపు వరకు సానిటేషన్ చేయాలి
- 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఈనెల 9నుంచి జరుగే నాగోబా జాతరకు వివిధ శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జీ పీఓ ఖుష్బు గుప్త, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి సంభందిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక నాగోబా దర్బార్ హాలులో సంభందిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగోబా పూజకు కేవలం రెండు రోజుల సమయం ఉన్నందున మెస్రం వంశీయులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తాగునీరు, విద్యుత్ దీపాలు, సానిటేషన్, మరుగుదొడ్ల నిర్మాణం రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జాతరలో అవసరమైన చోట మెడికల్ క్యాంపులు 24 గంటలు అందుబాటులో ఉంచాలని అదనపు జిల్లా వైద్యాధికారి బాలు కు సూచించారు. పోలీసుల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. జనం రద్దీ ఎక్కువగా ఉండే చోట 100 సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ఆశాఖకు సూచించారు. జాతరలో వెలిసే సుమారు 400 దుకాణాల్లో తినుబండారాలు తనిఖీ చేయాలని, దుకాణాల కాంటాలని తనిఖీ చేయాలని, ఆ శాఖ అధికారి జమాల్‌కు ఆదేశించారు. ఆర్టీసీ వారు అవసరమైన బస్సు సర్వీసులను కేస్లాపూర్ మీదుగా నడిపించాలన్నారు. జాతరలో నిరంతర విద్యుత్ పంపిణీతో పాటు, డీఆర్డీఓ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. జాతరలో విధులు నిర్వర్తించే పోలీసులు, ఇతర ప్రభుత్వ అధికారులకు భోజన సదుపాయం కల్పించాలని ఐటీడీఏ డీడీకి ఆదేశించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పకడ్బందీగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్పీ గౌస్‌ఆలం, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మెహతో, ఆర్డీఓ జివాకర్‌రెడ్డి, ఏపీఓ రాంబాబు జనరల్, ఆత్రం భాస్కర్ పీవీటీజీ, ఈఈ, భీం రావ్, బీఎడ్ ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, జెడ్పీటీసీ అర్క పుష్పలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వీడియో వైరల్ చేస్తున్న వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ విభాగం అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెన్నూర్ ఏర్పాటు చేసినా బహిరంగ సభలో చెప్పుతో కొడతానని అనడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, సభలో తీసిన వీడియోను సామాజిక మధ్యమాలో వైరల్ చేస్తున్న వారిపై చటరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీస్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల అధ్యక్షులు ఖయ్యూం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, నీసార్, గోవింద్, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సిడాం కౌసల్య, అన్నపూర్ణ, రవి, శేషు, నందం భీంరావు, భీమన్న పాల్గొన్నారు.

## వాల్ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాసనగర్ బుద్ధవిహార్‌లో తలపెట్టిన మాతా రమాబాయి అంబేద్కర్ 126వ జయంతిని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు జగ్‌జీవన్ అన్నారు. మంగళవారం అంబేద్కర్ అసోసియేషన్, ఆదివాసీ విద్యార్థి సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వాఘమరే జగ్‌జీవన్, ఉపాధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్, అధికార ప్రతినిధి బొంకంటి సుభాష్, నాయకులు ధావుల రమేష్, ఆదివాసీ నాయకులు దుర్వ మహేష్, ఆత్రం ఉపేందర్, దళిత నాయకులు సుషీల్, రాజేశ్వర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మహేష్, యువ నాయకుడు వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## మర్రిచెట్టు సన్నిధిలో మెస్రం వంశీయులు

- నేడు పీఠాధిపతికి ఆహ్వానం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి


మెస్రం వంశీయుల నాగోబా పూజకు మరో మూడు రోజులే మిగిలాయి. సోమవారం నాడు సాయంత్రం కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు వద్దకు మెస్రం వంశీయులు చేరుకున్నారు. గంగా జలంతో తెచ్చిన ఝరీ (కలశం) చెట్టు మీదకు భద్ర పర్చారు. పూజకు ఉపయోగించే సామాగ్రిని వెదురు గుళ్ళల్లో ఒక చోట భద్రపరిచారు. పూజ అయ్యే వరకు మూడు రోజుల పాటు ఈ చెట్టు వద్దనే సేదతీరుతారు.

**పటేల్‌కు మెస్రం వంశీయుల ఆహ్వానం...**

ఈ రోజు రాత్రి నాగోబా పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావుకు వారి ఆచార సాంప్రదాయం ప్రకారం కాలికోం, సన్నాయి, డోలు వాయిస్తూ మర్రిచెట్టు వద్ద సాదరంగా ఆహ్వానించారు. ఈ రోజు నుంచి పటేల్ గంగా జలంతో తెచ్చిన మెస్రం వంశీయులతో కలిసి రోజు వారి సాంప్రదాయ పద్ధతిలో వివిధ కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది.

## కేసీఆర్ పథకాలను అమలు పరుస్తున్న కాంగ్రెస్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-తలమడుగు

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసోందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో కళ్యాణలక్ష్మీ, షాదీముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు సుమారు 60ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. గత 10 సంవత్సర కాలంలోనే 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనకు తలదన్నే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిచిన 6 రోజులకే సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా అమలు చేస్తానన్న పథకాలు ఎమయ్యాయని ప్రశ్నించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 6 రోజులకే కళ్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం హామీలు ఎవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండు నెలలు గడిచినా రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధు రైతుల ఖాతాలో జమ కాలేదని అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని అన్నారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి, సర్పంచ్‌ను, వార్డు సభ్యులను సన్మానించారు. అనంతరం ఇటీవల మండల కేంద్రంలో మరణించిన జక్కుల గంగమ్మ, అలుగంటి పోసాని వారి కుటుంబాలను పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల తహసీల్దార్ రాజమోహన్, మండల అభివృద్ధి అధికారి రమాకాంత్, మండల కన్వీనర్ వెంకటేష్, ఎంపీటీసీ చంటి, బీఆర్ఎస్ నాయకులు ముడుపు కేదారీశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు కరుణాకర్‌రెడ్డి, మహేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, అభిరామిరెడ్డి, ఆసం రవి, నిమ్మల సుదర్శన్ రెడ్డి, గంగాధర్, పోతారెడ్డి, నేతుల గంగన్న, అబ్దుల్లా, కిరణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్‌రావు, వెంకట్ యాదవ్, అశోక్, విలాస్ పలువురు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీపీ




నవతెలంగాణ-ఉట్నూర్

ఎమ్మెల్యే కోవ లక్ష్మీ జన్మదిన సందర్భంగా మంగళవారం ఆసిఫాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు బీఆర్ఎస్, సీనియర్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్‌లు మాట్లాడుతూ ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో బాగుండాలని కోరుకుంటూ, ప్రజా సేవలో ముందు ఉండి ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్న నాయకురాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫారూఖ్ పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

పేదలను అన్ని విధాలుగా ఆదుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం ఉట్నూరు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన ఉప్పుల లక్ష్మి నారాయణ కుటుంబ సభ్యులకు రూ.4లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరుగుతుందని తెలిపారు. చికిత్సలు చేసే సమయంలో సీఎంఆర్ఎఫ్ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అధిక సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీలను పేద ప్రజలకు అందజేస్తున్నామని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | ఫిబ్రవరి 07, 2024 | www.navatelangana.com


## సేవ చేయడం అదృష్టంగా భావించాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి పార్సీ అశోక్

**నవతెలంగాణ-ఆసిఫాబాద్**

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పార్సీ అశోక్ అన్నారు. జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక అవసరాలు గల విద్యా రిసోర్స్ పర్సన్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ రిసోర్స్ పర్సన్‌గా సన్మానం పొందిన సతీష్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందిస్తున్న సేవలను గుర్తించి కలెక్టర్ సన్మానించడం ఆనందకరమన్నారు. జిల్లాలో రిసోర్స్ పర్సన్స్ ఇదేవిధంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎడ్యూకేషన్ మరియు కమ్యూనిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ కటకం మధుకర్, కోఆర్డినేటర్ అబిద్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ పాల్గొన్నారు.

## ప్రవర్తనలో మార్పు లేకుంటే పీడీ యాక్టు

**నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్**

మండలంలోని ఈజ్ గాం పోలీసు స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు కన్పించకపోతే పీడీయాక్టు కింద కేసులు నమోదు చేస్తామని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం ఈజ్‌గాం పోలీసు స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మానవత విలువలతో కూడిన జీవనాన్ని అలవర్చుకుంటేనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. కుటుంబ యాజమనులు చెడుమార్గాన్ని అనుసరించడం వలన పిల్లలు కూడా ఆనుకరించే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. నేరచరిత్రకు దూరం కావాలంటే చెడు ప్రవర్తనకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు చేసే సమాజవ్యతిరేక కార్యక్రమాలను పిల్లలు కూడా అనుకరిస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు హిరామన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## గర్భిణుల వివరాలు నమోదు చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**నవతెలంగాణ-ఆసిఫాబాద్**

ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, గర్భం దాల్చిన వ్యక్తి ఒక్కరి వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాంతో కలిసి వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన ప్రతి మహిళ తమ వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో నమోదు చేసుకునే విధంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా వారి పరిధిలోని గర్భిణుల వివరాలను సేకరించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని, రక్తహీనతతో బాధపడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి వారికి పోషకాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా నమోదైన గర్భిణుల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**గ్రంథాలయం పనుల పరిశీలన**

జిల్లాలో రూర్బన్ పథకంలో భాగంగా చేపట్టిన జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. గ్రంథాలయంలో పాఠకులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలను అందుబాటులో ఉంచాలని, ఫర్నిచర్ ఇతరత్రా అవసరమగు సామాగ్రిని సమకూర్చాలని ఆదిలాబాద్ విద్య, సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అభయంత, గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి ఫాంపాండ్ నిర్మాణాలు



**నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్**

వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి అనుకోడ అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ చట్టంలో ఫాంపాండ్ నిర్మాణాలు చేపట్టినట్టు ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మంగళవారం అనుకోడ అటవీ ప్రాంతంలో చేపట్టిన ఫాంపాండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో తాగునీటి సదుపాయం లేనందున వ్యన్యప్రాణులు దప్పిక తీర్చుకోవడం కోసం గ్రామాల్లోకి వచ్చి వేటగాళ్ల చేతిలో హతమవుతున్నాయన్నారు. వారి దప్పికను తీర్చేందుకు వీటిని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సోహేజ్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మీ ఉన్నారు.

## బాల్క సుమన్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



**నవతెలంగాణ-ఆసిఫాబాద్**

చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, వెంటనే వెనక్కి తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్క సుమన్ తన స్థాయి మర్చి సీఎంను విమర్శించడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా ఆయన చేసిన అక్రమాలు బయటపడతాయని భయంతో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసినదేమి లేదని మేడిగడ్డ కుంగిపోయిందని, మిషన్ భగీరథ నీరు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జిల్లా నాయకులు చరణ్, గుండా శ్యాం, వసంత్, కాశయ్య, జక్కయ్య పాల్గొన్నారు.

**బెజ్జూరు :** మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలకేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు బూస శంకర్ మాట్లాడుతూ తాము అధికారంలో లేనప్పుడు హుందాతనంగా వ్యవహరించామని, అధికారం కోల్పోయిన బాల్కసుమన్ ముఖ్యమంత్రిపై ఇష్టంవచ్చినట్టు మాట్లాడితే సహించి ఊరుకోమని హెచ్చరించారు. ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అకీమ్, విష్ణు, హనుమంతు, రాజారాం, శైలేష్ పాల్గొన్నారు.

# 11న కాగజ్‌నగర్‌లో బహిరంగ సభ

● జయప్రదం చేయలి : సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్




దహెగాం : సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్

**నవతెలంగాణ-దహెగాం**

ఈ నెల 11న కాగజ్‌నగర్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో సీఐటీయూ మండల కన్వీనర్ రమేష్ అధ్యక్షతన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 16న జరుగనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె సందర్భంగా ఈ నెల 11న మధ్యాహ్నం 12 గంటలకు కాగజ్‌నగర్‌లో జరిగే బహిరంగ సభకు కార్మిక, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి పదేండ్లు అవుతున్న రైతాంగ, కార్మిక వర్గ, ప్రజల సమస్యలను పరిష్కరించలేదని, భారత్ వెలిగిపోతుందని, అచ్చాదిన్ ఆయేగా విశ్వగురు ఆత్మనిర్భర్ భారత్ మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలిచ్చినా ఏమీ ఒరగలేదన్నారు. ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో భాగంగా ఈ నెల 11న నిర్వహించే బహిరంగ సభకు జిల్లాలోని వివిధ కార్మిక సంఘాల్లో పనిచేసే కార్మికులందరు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి, మండల కో కన్వీనర్ వజ్రమ్మ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి జయప్రద, ఆశావర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు శోభ, మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ మండల అధ్యక్షులు సమత, కోశాధికారిని శ్రీలత పాల్గొన్నారు.

**పెంచికలపేట్ :** ఈ నెల 11న కాగజ్‌నగర్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 16న జరుగబోయే దేశవ్యాప్త కార్మికుల సమ్మె సందర్భంగా ఈ నెల 11న జరిగే బహిరంగ సభకు సీఐటీయూ ఆలిండియా కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర కోశాధికారి రాములు, రాష్ట్ర కార్యదర్శి మధు హాజరవుతున్నారని, కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, ఆశావర్కర్లు శిరీష, సుజాత, అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ, రాజమణి, శ్రీలత పాల్గొన్నారు.

# పొరపాట్లు లేని ఓటరు జాబితా రూపొందించాలి

● కలెక్టర్ బొర్కడే హేమంత్

**నవతెలంగాణ-ఆసిఫాబాద్**

ఫోటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన కోటరు జాబితా రూపొందించేందుకు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పని చేసి స్పష్టమైన జాబితా రూపొందించాలని అన్నారు. ఎస్ఎస్ఆర్ 2024లో నూతన ఓటరు నమోదు కోసం జిల్లాలోని 2 నియోజకవర్గాల నుండి 9,238 దరఖాస్తులు రాగా 8,829 దరఖాస్తులను అర్హులుగా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ఓటరు జాబితా నుండి తొలగింపుకు ఫారం 7 ద్వారా 7,551 దరఖాస్తులు రాగా నిబంధనల మేరకు 7,424 దరఖాస్తులకు సంబంధించి నోటీసులు జారీ చేసి తొలగింపుకు చర్యలు తీసుకున్నామన్నారు. 123 దరఖాస్తులను తిరస్కరించామని పేర్కొన్నారు. పేర్లు, చిరునామా సవరణల కొరకు 4,496 దరఖాస్తులు రాగా 4,279 దరఖాస్తులను పరిష్కరించి, 217 దరఖాస్తులను తిరస్కరించామని తెలిపారు. ఓటర్ల సౌకర్యార్థం సహాయక పోలింగ్ కేంద్రాలతో కలిపి జిల్లా వ్యాప్తంగా 676 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్ భవన సముదాయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే విధంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

# 16న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి




**నవతెలంగాణ-సిర్పూర్(టి)**

కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల చట్టాలకు వ్యతిరేక చట్టాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి కోరారు. మంగళవారం మండలంలోని చింతకుంట గ్రామ సమీపంలో ఉపాధిహామీ చట్టం పని ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టంలో పనిచేస్తున్న కార్మికులకు దినసరి వేతనం రోజుకు రూ.200 చెల్లిస్తూ శ్రమదోపిడికి గురిచేస్తుందని, కనీసం రూ.600 చెల్లించాలని, పని ప్రదేశంలో మౌళిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవడం సరైందికాదని ఆయన విమర్శించారు. అలాగే పని ప్రదేశంలో మరణిస్తే రూ.10 లక్షల చెల్లించడమే కాకుండా తక్షణమే రూ.50 వేలు దహన సంస్కరణల ఖర్చులకు వారి కుటుంబాలకు ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 16న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ఉపాధిహామీ చట్టం క్షేత్రస్థాయి అధికారి చీపెల్లి శంకర్, మేట్‌లు, కార్మికులు పాల్గొన్నారు.

**సమ్మె నోటీస్ ఇచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులు**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వివిధ జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ కార్మిక సంఘాల, వివిధ రంగాల ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఈ నెల 16వ తేదీన సమ్మె నిర్వహిస్తున్నట్టు మధ్యాహ్నభోజన మండల కార్యదర్శి రూప తెలిపారు. మంగళవారం మండల విద్యాధికారి కార్యాలయంలో సిబ్బంది ప్రకాష్‌కు సీఐటీయూ పిలుపు మేరకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ మధ్యాహ్నభోజనం పథకం కార్మికులందరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, రమా, మల్లుబాయి, కమల, మీరాబాయి, సుశీల, నాగుబాయి, రుక్మాబాయి, సుక్కుబాయి పాల్గొన్నారు

**జైనూర్ :** ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో ఆశావర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఆశావర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు సులోచన కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి జితేందర్‌రెడ్డికి ఆశావర్కర్లతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ బందుకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల సంఘాలతో కలిసి దేశవ్యాప్త బందుకు తాము మద్దతిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కార్మిక ఉద్యోగ సంఘాల అనుబంధ యూనియన్‌గా ఉన్న ఆశావర్కర్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సమ్మెలో డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. పారిశ్రామిక విధానాల చట్టం 1947 సెక్షన్ 22 సబ్‌సెక్షన్(1)ను అనుసరించి సమ్మె నోటీసు ఇవ్వడం జరుగుతుందన్నారు. 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

**రెబ్బెన :** ఎన్‌హెచ్ఎంకు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, 45వ ఐఎల్‌సీ సిఫారసు ప్రకారం ఆశాలను కార్మికులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని సీహెచ్‌సీ ప్రభుత్వ ఆస్పత్రిలో సీహెచ్ఓ వెంకటేశ్వర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిలభారత ఫెడరేషన్‌లు, సంయుక్త కిసాన్ మోర్చా, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఫిబ్రవరి 16న అఖిలభారత స్థాయిలో కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద పాటించాలని నిర్ణయించాయన్నారు. ఇందులో కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు, ప్రతి నెల రూ.10 వేల పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు రమా, సుకన్య, అనిత, స్వప్న, సుజాత, సునీత, లలిత పాల్గొన్నారు.




## రేషన్ డీలర్‌పై కేసు నమోదు

**నవతెలంగాణ-సిర్పూర్(టి)**

ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసే రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నయన్న సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తనిఖీలు నిర్వహించారు. డోర్‌పెల్లి రేషన్ దుకాణంలో నిల్వ కంటే అధికంగా నిల్వ ఉండాన్ని గుర్తించారు. అక్రమ్ హైమద్ రేషన్ దుకాణంలో నిల్వల కంటే ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం అధికంగా ఉన్నాయని, ఈ విషయంపై రేషన్ డీలర్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో కేసు నమోదుచేశామన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. తదుపరి విచారణకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు డీటీ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా బియ్యన్ని నిల్వ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వినికిడి లోపం గల వారికి ఉపకరణాల పంపిణీ

**నవతెలంగాణ-ఆసిఫాబాద్**

వినికిడి లోపం గల 0 నుండి 18 సంవత్సరాల విద్యార్థులకు గుజరాత్‌కు చెందిన "వుయి ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్" ఆధ్వర్యంలో అందించనున్న ఉపకరణాలకు సంబంధించి వివరాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాధికారి అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వినికి లోపం ఉన్న వారికి ఉపకరణాలు ఉపయోగపడుతాయనానరు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకము మధుకర్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అబీద్ అలి, హెచ్ఎం సుభాష్, ఐఆర్పీలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు లహరి బస్సు

**నవతెలంగాణ-ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ డిపోకు వచ్చిన ఏసీ స్లీపర కోచ్ బస్సు లహరి అమ్మ ఒడిలాంటి అనుభూతి బస్సును హైదరాబాద్‌కు రెండు వేళల్లో నడుపుతున్నామని డిపో మేనేజర్ శ్రీధర్ తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపో నుండి నూతనంగా లహరి స్లీపర్, ఏసి బస్సులు హైదరాబాద్‌కు ఉదయం 9.30, రాత్రి 9.15 గంటలకు నడపనున్నట్లు, అలాగే తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ నుండి ఉదయం 9 గంటలకు, రాత్రి 8:30కు బస్సు వేళలు నిర్ణయించామన్నారు. ఉదయం బస్సు నేరుగా హైదరాబాద్ వెళ్తుందన్నారు. రాత్రి బస్సులు కాగజ్‌నగర్ మీదుగా వెళ్తాయని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కూడా అలాగే ఉంటుందన్నారు. ఆసిఫాబాద్ నుండి హైదరాబాద్ సీటర్‌కు 850, స్లీపర్ కు1180 చార్జీలుంటాయన్నారు. ప్రయాణికులకు మరిన్ని సేవలు అందిచాలనే ఉద్దేశంతో ఈ లహరి బస్సులను తీసుకుని రావడం జరిగినదని, ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ బస్సులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కోసం టీఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా సీటు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు.

**చంద్రాపూర్‌లో టీఎస్ ఆర్టీసీ కార్గో**

మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో టీఎస్ ఆర్టీసీ కార్గో ఏర్పాటు చేసినట్లు డిఎం శ్రీధర్ తెలిపారు. టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) ఆఫీసును బస్టాండ్ బయట ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు ఏజెంట్ ఫోన్ నెంబర్ 7972517548, 8668208939లను సంప్రదించాలని కోరారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**నవతెలంగాణ-జైనూర్**

జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా జరుపుకున్నారు. జైనూర్ మండలకేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ కనక యాదవరావు నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సిర్పూర్(యు) మండలంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ భగవంత్‌రావు, పార్టీ అధ్యక్షులు తొడసం ధర్మారావు, లింగాపూర్ మండలంలో ఆత్రం అనిల్, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కేట్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

**రెబ్బెన :** ఎమ్మెల్యే కోవలక్ష్మి పుట్టిన రోజు వేడుకలను మండల ప్రజా ప్రతినిధులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల ఎంపీపీ జుమ్డి సౌందర్య ఆనంద్ ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందించి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మెన్ కార్నాదం సంజీవ్, నంబాల మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, పల్లె రాజేశ్వర్‌రావు, గోలేటి గ్రామ మాజీ సర్పంచ్ పోటు సుమలత, రెబ్బెన మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, మాజీ ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, బొమ్మినేని శ్రీధర్, వనజ, కుందారపు శంకరమ్మ, మాన్యం పద్మ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**అభిమానం చాటుకున్న బేకరి నిర్వాహకుడు మల్లేష్**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా మండలకేంద్రంలోని బేకరి నిర్వాహకుడు మల్లేష్ 50 కిలోల కేక్ తయారుచేసి తన అభిమానాన్ని చాటుకున్నారు.

**కెరమెరి :** మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేందూరు మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మాకి ద్రుపత బాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీటీసీ ఇఫ్తేకార్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, అనంతపూర్ ఎంపీటీసీ సకరాం, నాయకులు ఇనూస్, లెన్గూరే బాలాజీ, నాణేశ్వర్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పతకాలు సాధించిన ఆదర్శ విద్యార్థులు



**నవతెలంగాణ-ఆసిఫాబాద్**

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఎనిమిది మంది విద్యార్థులు జాతీయ స్థాయి యోగా పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆదివారం బెల్లంపల్లిలో ఇండియన్ యోగా స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో జూనియర్ విభాగంలో పాఠశాలకు చెందిన ఎస్.సాయి ప్రణీత, బి.దీపిక ప్రథమ స్థానం, హారిక ద్వితీయ స్థానం, సంహిత తృతీయ స్థానంలో నిలవగా సీనియర్ విభాగంలో బి.వర్షిణి, జే.అంజలి, డి.విద్య, ప్రతిభా బిశ్వాస్ ప్రథమ బహుమతి సాధించారు.

**సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ**

సోషల్ టాలెంట్ టెస్ట్ ఆంగ్ల మాధ్యమ విభాగంలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు కే.జశ్వంత్ జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించగా ఎస్.వేదాక్షర ద్వితీయ బహుమతి, ఎం.మనస్విని తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శంకర్, సంపత్, సైపుల్లా ఖాన్, కే.శోభ, వ్యాయామ ఉపాధ్యాయుడు బి. తిరుపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

## నూతన చౌకధరల దుకాణం ప్రారంభం

**నవతెలంగాణ-వాంకిడి**

మండలంలోని సరండి గ్రామంలో మంగళవారం తహసీల్దార్ రహీమొద్దీన్, మాజీ సర్పంచ్ కమలాకర్ నూతన చౌకధరల దుకాణాన్ని ప్రారంభించారు. గతంలో కిర్డీ గ్రామానికి వెళ్లి బియ్యం తీసుకోవాల్సిన పరిస్థితి ఉండగా కార్డుదారులు ఇబ్బందులు పడేవారని, లబ్ధిదారుల సౌకర్యం కోసం సరండి గ్రామంలో చౌకధరల దుకాణం ప్రారంభించామని తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమలాకర్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నవతెలంగాణ మంచిర్యాల

బుధవారం | ఫిబ్రవరి 07, 2024 | www.navatelangana.com

## ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

నవతెలంగాణ-జన్నారం



ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం అయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గంధం చిన్ని ట్రాక్టర్లో గడ్డి తీసుకెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు అంటుకొని మంటలు చెలరేగాయి. గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పివేశారు. ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి పూర్తిగా కాలిపోయిందని బాధితుడు తెలిపారు. దాదాపు రూ.30 వేల నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఉచిత రక్త పరీక్షలు

నవతెలంగాణ-మందమర్రి



ఎనీమియా ముక్త్ భారత్ పథకం క్రింద మంచిర్యాల జిల్లా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం మందమర్రి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. 186 మంది ఇంటర్ ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధ పడే విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ కుమార్, ఫార్మసిస్ట్ అజయ్ కుమార్, ఏఎన్ఎం శ్రీలత, రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-జన్నారం

పేదలను అన్ని విధాలుగా ఆదుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూరు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని రొటీగూడ గ్రామానికి చెందిన ఉప్పుల లక్ష్మి నారాయణ కుటుంబ సభ్యులకు రూ. 4లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. చికిత్సలు చేసే సమయంలో సీఎంఆర్ఎఫ్ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అధిక సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసిలను పేద ప్రజలకు అందజేస్తున్నామని పేర్కొన్నారు.

## ఆరుగురు అటవీ అధికారుల సస్పెన్షన్

నవతెలంగాణ-జన్నారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరుగురు అటవీ అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే అభియోగం మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల పులుల అభయారణ్యంలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలలోని ఆరుగురు అటవీ శాఖ సెక్షన్, బీట్ ఆఫీసర్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కవ్వాల పులుల అభయారణ్యంలోని మంచిర్యాల జిల్లాలోని జన్నారం డివిజన్ ఇంధన్‌పల్లి రెంజ్ కవ్వాల ఫారెస్ట్ సెక్షన్, బిట్ ఆఫీసర్లు అఫ్జల్ ఖాన్, శ్రీధర్, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ ఫారెస్ట్ రెంజ్ పరిధిలోని ఇస్లాంపూర్ వేస్ట్, కొత్తపల్లి అటవీ శాఖ సెక్షన్, బిట్ ఆఫీసర్లు వినయ్ కుమార్, ఇమ్రాన్‌లను కాళేశ్వరం జోన్ సీఎఫ్ శాంతారామ్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాసర జోన్‌లోని నిర్మల్ జిల్లా ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని ఇస్లాంపూర్ ఈస్ట్ ఫారెస్ట్ సెక్షన్, బీట్ ఆఫీసర్లు రవికుమార్, భుమేష్‌ను ఆ జోన్ సీఎఫ్ శరవణన్, నిర్మల్ డీఎఫ్ఓ రామకృష్ణ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆయా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల ద్వార మంగళవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ వినయ్ కుమార్ సాహు ఆయా ఆటవీశాఖ బీట్, సెక్షన్లలో తనిఖీలు నిర్వహించగా, ఆయా అటవీ శాఖ బీట్లలో టేకు చెట్ల నరికివేత జరిగిందని, ఈ వ్యవహారంలో సంబంధిత ఫారెస్ట్ అధికార్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారిని సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

## యునైటెడ్ ఫోరం మండల కన్వీనర్‌గా సంపత్

నవతెలంగాణ-జైపూర్

ఆర్టీఐ 2005 యునైటెడ్ ఫోరం మండల కన్వీనర్‌గా మండలానికి చెందిన చిప్పకుర్తి సంపత్‌ను నియామించినట్లు రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కన్వీనర్ జీవన్‌జోల్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కో కన్వీనర్‌గా ప్రతీప్ రెడ్డి, జిల్లా కమిటి సభ్యులుగా తాటిపర్తి సాయికృష్ణ రెడ్డి నియమకం కాగా వారికి పత్రాలు అందజేశారు.

## వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఇటీవల క్యాతనపల్లి మున్సిపల్ చైర్మెన్ జంగం కళ, వైస్ చైర్మెన్ సాగర్ రెడ్డిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం విగిపోయింది. అవిశ్వాసం రోజురోజుకు మలుపు తిరుగుతూ రసవత్తరంగా మారింది. బీఆర్ఎస్ సొంత పార్టీకి చెందిన చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై జనవరి10న కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస నోటీసులు అందించారు. అవిశ్వాసం పెట్టడంతో ఇటీవల చైర్మెన్, వైస్ చైర్మెన్‌తో పాటు మరికొంత మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో రాజకీయ వేడి రసవత్తరంగా మారింది. మంగళవారం ఆర్డీఓ రాములు మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మాణ పక్రియ సమావేశాన్ని ప్రారంభించారు. 22 మంది కౌన్సిలర్లు ఉన్నారు. జీఓఎంఎస్ 835లోని రూల్ 10(3) ప్రకారం సభ్యులలో 2/3 వంతు అనగా 15 మంది సభ్యులకు బీఆర్ఎస్‌కు చెందిన 13 మంది కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. కావాల్సిన కోరం 15మంది సభ్యులు లేనందున, అవిశ్వాస తీర్మానం ఓటింగ్ జరగలేదు. రూల్ 10(3) ప్రకారం చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మాణం కోరం లేక వీగిపోయినట్టు ఆర్డీఓ రాములు ప్రకటించారు.

## 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను సింగరేణి కాంట్రాక్టు కార్మికులు జయప్రదం చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కోరింది. మంగళవారం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్‌కేపీఓసీ మేనేజర్‌కు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. 12 గంటల పని విధానంతో కార్మికులను వెట్టి చాకిరి చేయించాలని కుట్రలు చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టి దేశ భవిష్యత్తుని ప్రశ్నార్థకంగా మార్చి దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలను అమలు చేయకుండా జాతీయ కనీస వేతనం రూ.178 ఇవ్వాలంటూ నిర్ణయించడం నిలువున ముంచడమే అవుతుందన్నారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కాంట్రాక్టు కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్, గడ్డం సంతోష్ పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట :** ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే సమ్మె నోటీసును వెంకట్రావుపేట పీహెచ్‌సీలో డాక్టర్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26000 చెల్లించాలని, టార్గెట్ల పేరుతో అధికారుల వేధింపుల ఆపాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ప్రతి నెల రూ.10 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్ చేపట్టాలని అఖిల భారత కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునివ్వడం జరిగిందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, కార్మిక హక్కుల కాపాడుకోవడానికి ఉపాధి హామీ రక్షణ, రైతుల పంటలకు మద్దతు ధర, ప్రజా సమస్యల పరిష్కారానికై దేశ వ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొని జయప్రదం చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు రాణి, గురులక్ష్మి, మమత, కవిత, అపర్ణ, లలిత, హైమావతి, సత్యవతి, పద్మ, సునీత పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్‌లో..



లక్షెట్టిపేటలో..

## మీ పిల్లలైతే ఇదే పెడతారా..?

- విద్యార్థుల తల్లిదండ్రులు
- ముల్కల్ల సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల విద్యార్థుల ఆందోళన
- గేట్లు వేసి నిర్బంధించిన ప్రిన్సిపాల్



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ-హాజీపూర్



పురుగుల అన్నం నీళ్ల చారు మేము తినలేం.. చదువుకూడ సరిగ్గా చెప్పడం లేదంటూ ముల్కల్లలోని సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విద్యార్థులు మంగళవారం భోజనం చేయకుండా ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లాగా విద్యార్థులు పురుగుల అన్నాన్ని చూపించడంతో పేరెంట్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రహదారిపై ధర్నాకు దిగారు. సిబ్బంది గేట్లు వేసి వారిని నిర్బంధించారు. సమాచారం అందుకున్న మీడియా లోపలికి వెళ్ళే ప్రయత్నం చేయగా గేట్లకు తాళాలు వేశారు. లోపలికి ప్రవేశించిన మీడియాను చూసిన పేరెంట్స్, విద్యార్థులు నినాదాలు చేయడంతో ప్రిన్సిపల్ గేట్లు తెరిపించారు.

**మీ పిల్లలు అయితే ఇదే పడుతారా..?**

పిల్లల భవిష్యత్ కోసం రెసిడెన్షియల్ పాఠశాలలో చేరిపిస్తే ఇక్కడ తిండి సరిగ్గా లేదని, మీ పిల్లలకు ఇదే భోజనం పెడుతారా..? అని ప్రిన్సిపాల్ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. గతంలో ఈ పాఠశాల జిల్లా కేంద్రంలోని అండాలమ్మ కాలనీలో ఉంటే అక్కడ డంపింగ్ యార్డ్‌తో దుర్గంధం, పొగ వస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం చెడిపోతుండడంతో హాజీపూర్ మండలంలోని ముల్కల్ల ప్రయివేట్ భవనంలోకి వచ్చేలా కృషిచేశామన్నారు. అయిన ఇక్కడ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేరెంట్స్ మీటింగ్‌కు వచ్చే సమయంలో మాత్రమే కాస్త శుభ్రంగా ఉంచుతారని, రోజు వారి ఎక్కడి చెత్త అక్కడే, దుర్గంధం వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. పాఠాలు సరిగ్గా చెప్పడం లేదని, ఆట స్థలం లేదనీ అవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిరోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు.

**బియ్యంలో కాదు క్యాబేజీలో..**

పురుగులు బియ్యంలో రాలేదని, క్యాబేజీలో వచ్చాయని ప్రిన్సిపల్ తన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. చూసుకోకుండా పొరపాటున విద్యార్థుల ప్లేట్లలోకి వచ్చాయని సమాదానం చెప్పారు. విద్యార్థులకు సరిగ్గానే పాఠాలు బోధిస్తున్నామని, సంక్షేమంపై రోజు క్రమం తప్పకుండా చూస్తున్నామన్నారు. అదే విధంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడడానికే గేట్లు వేశామని వివరణఇచ్చారు.



నిర్బంధంలో ఉన్న విద్యార్థులు



తల్లిదండ్రులను బయటకు రానివ్వకుండా గేటు వేసిన సిబ్బంది

## ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించండి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం మంజూరు చేసినప్పటికి స్థలం కేటాయించని కారణంగా పనులు ప్రారంభం కాలేదన్నారు. భీమారం మండలం పరిధిలో 11 గ్రామ పంచాయతీ ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకోని స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారాఉ. ఇందులో పార్టీ నాయకులు ఆవిడపు రవితేజ, ఈరబోయిన బానేష్, సందనవేని అజయ్, ఎడ్ల ప్రభాకర్, మాటేటి సాగర్, ఆవిడపు మహేష్, కే నరేష్ ఉన్నారు.

## ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బైరి నరేశ్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. బీఆర్ఎస్ సభ్యత్వ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేతుల మీదుగా నరేశ్ భార్య సంధ్యకు అందించారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మడావి అనంతరావు, అట్టెపల్లి శ్రీనివాస్, వడ్లూరి మల్లేశ్, కైలాస్, భగీరథ్ పాల్గొన్నారు.

## విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలి

నవతెలంగాణ-తాండూర్

వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య సూచించారు. మంగళవారం ఎంఈఓ వాసాల ప్రభాకర్‌తో కలిసి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ఫలితాలు రాబట్టేలా బోధన సిబ్బంది కృషి చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సబ్జెక్టుల వారిగా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. తాండూర్ కేజీబీవీలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థుల పురోగతిని పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల వసతి, భోజన సౌకర్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త పాటించేలా చూడాలన్నారు. వంట సామాగ్రి, భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో కేజీబీవీ ఎస్ఓ సుమన, చైతన్య, బోధన సిబ్బంది కళావతి, సుజాత, నిర్మల, సంధ్యారాణి, సుధారాణి ఉన్నారు.

## నేటి నుంచి జీపీలో ప్రత్యేక పారిశుధ్య పనులు

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో గ్రామ పంచాయతీల వారిగా ప్రత్యేక పారిశుధ్య పనులు ప్రారంభించాలని భీమారం ఎంపీడీఓ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 7 నుండి 15 వరకు పనుల నిర్వాహణ కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమాల నిర్వాహణలో ఎంపీపీ, జెడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, గ్రామ పురప్రముఖులు గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

నవతెలంగాణ-తాండూర్

యువభారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తంగాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశం మాట్లాడుతూ యువశక్తి ఫౌండేషన్ సభ్యులు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నాలుగు సంవత్సరాల నుండి ఎగ్జామ్ ప్యాడ్లను అందిస్తున్నారని తెలిపారు. ఫౌండేషన్ ఇన్‌చార్జి జీవన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఉద్దేశంతో పరీక్ష ప్యాడ్లను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాము, ఫౌండేషన్ సభ్యులు జీవన్, రోషన్, ఆనంద్, మణికిరణ్, యువ కుమార్, సురేష్, అనిల్, జ్ఞానేశ్వర్, ధను పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకం అమలుకు సహకరించాలి

నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గృహజ్యోతి పథకం అమలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని భీమారం ఎంపీడీఓ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం అమలులో భాగంగా బుధవారం నుండి గ్రామ పంచాయతీల పరిధిలో లబ్దిదారులకు సంబంధించి సర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సర్వే కోసం వచ్చిన వారికి లబ్దిదారుల ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, సర్వీస్ కనెక్షన్ నంబర్‌తో పాటు మొబైల్ నెంబర్ వివరాలు అందించాల్సివుంటుందని తెలిపారు. ఈ విషయంలో వాట్సాప్ గ్రూపులులతో పాటు టాంటాం ద్వార గ్రామ పంచాయతీ ప్రజలకు తెలియజేయాలని కోరారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 100, 7-10 తరగతులలో మిగిలిన సీట్ల ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 1న హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మే 5న ఫలితాలు వెల్లడిస్తామన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ.సీజీజీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## మతిభ్రమించి సీఎంపై బీఆర్ఎస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలు



జైపూర్‌లో బాల్క సుమన్ ఫ్లెక్సీ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో అధికారంలో కోల్పోవడంతో బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల అనుచిత వాఖ్యలు చేయడమే కాకుండా చెప్పుతో కొడుతాని హెచ్చరించడాన్ని నాయకులు ఖండించారు. సోమవారం బాల్క సుమన్ చిత్ర పటానికి చెప్పుల దండ వేసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేవారు. సుమన్ బహిరంగంగా రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక ముందు ఇలాంటి చర్యలకు పాల్పడితే నియోజకవర్గం అడుగు పెట్టనివ్వమని హెచ్చరించారు. ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణాలో పదవులు అనుభవించి ఆర్థిక దోపిడికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకుల తీరును ప్రజలు తీరస్కరించి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మహమ్మద్ ఫయాజోద్దీన్, కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చల్ల సత్యనారాయణ రెడ్డి, చల్ల విశ్వంబర్ రెడ్డి, గుడెల్ల శ్రీనివాస్ రెడ్డి, బేతు తిరుపతి రెడ్డి, జక్కుల వెంకటేశం, ముదాం రమేష్, తొగరి శ్రీనివాస్, జయపాల్ గౌడ్, దూట పండరి, చెలుకల పోశం, బేద మల్లేష్, నామాల నాగరాజు, నామాల తిరుపతి, యూత్ అధ్యక్షులు ఆసంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

**కాసిపేట :** బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కొండాపూర్ యాప చౌరస్తాలో బాల్క సుమన్ దిష్టి బొమ్మని చెప్పులతో కొట్టి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్క సుమన్‌కి అధికారం కోల్పోవడంతో పిచ్చి పట్టి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆనాడు తెలంగాణ ఉద్యమం సమయంలో ఇలాగే విద్యార్థులను రెచ్చగొట్టి ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించి ఎంతో మంది విద్యార్థుల ఆత్మ బలిదానాలకు కారణమయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సహకర సంఘం చైర్మెన్ పూస్కూరి వంశీ కృష్ణా రావు, మాజీ మండల అధ్యక్షులు సిద్ధం తిరుపతి, ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, భీంరావు, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ రాపర్తి శ్రీను, మాజీ సర్పంచ్ ఉత్తురి సత్తయ్య, నాయకులు శేఖర్ రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్, మైనార్టీ మండల అధ్యక్షుడు షాకిర్, యువజన మండల ప్రధాన కార్యదర్శి జంగిలి రమేష్, ఉపాధ్యక్షుడు తిరుపతి, ప్రచార కార్యదర్శి గణేష్, మహంకాళి, విద్యాసాగర్, చెండె నవీన్, చిన్నాలి మధు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట :** సీఎం రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. మంగళవారం ఉత్కూరు చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. అహంకారాన్ని సహించలేకనే ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్పిన నాయకుల్లో మార్పు రాలేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్, మండల అధ్యక్షులు పింగిళి రమేష్, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు..

**జన్నారం :** సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముసాఫర్ అలీ, ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్ రెడ్డి ఏనుగు సుభాష్ రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై తహసిల్ చౌరస్తా వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బహిరంగ క్షమాపణ చెప్పకపోతే బాల్క సుమన్ తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫసియుల్లా, ఇసాక్, బాదావత్ సుధాకర్ నాయక్, దాముక కరుణాకర్, అల్లం రవి, కంటెం శంకర్, అజ్మీర నందు నాయక్, టేకుమట్ల పంకజ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యం సతీష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహెల్ షా, బొంత లక్ష్మణ్, నరసింగరావు, మౌలానా రజాక్, మంద రాజేష్, మహమ్మద్ అజారుద్దీన్,పాల్గొన్నారు.

**మందమర్రి :** సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చేప్పాలని మాజీ ఎమ్మెల్యే విప్ నల్లాల ఓదేలు డిమాండ్ చేశారు. మందమర్రిలోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మరోసారి ముఖ్యమంత్రి, పార్టీ నాయకులు, కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తరిమి కొడతాం హెచ్చరించారు. ముఖ్యమంత్రిని చెప్పుతో కొడతానని వ్యాఖ్యలు చేసిన ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో గుడ్ల రమేష్, తిరుమల్ రెడ్డి, నర్సింగ్, పాషా, సరిత పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-కౌటాల



ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని తాటిపెల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై మధూకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాటిపెల్లి గ్రామానికి చెందిన దంద్రె అశోక్(23) చేనులోని మిరప తోటకు నీళ్లపెట్టే క్రమంలో కాలుజారి బావిలో పడిపోయాడు. మృతుడి అన్న విలాస్ తీసే ప్రయత్నం చేశాడు. ఈత రాకపోవడంతో స్థానికులకు తెలియజేడు. మరో ఇద్దరి బావిలో నుంచి బయటకు తీశారు. సిర్పూర్ సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తండ్రి పరుశు రాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటాడని అనుకుంటే ఆకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బోరున విలపించారు.


# నవతెలంగాణ

నవ్య తెలుగు దినపత్రిక

## ఆదిలాబాద్

బుధవారం | ఫిబ్రవరి 07, 2024 | www.navatelangana.com




## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఇటీవల ఇతర రాష్ట్రంలో నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విద్యార్థులను మంగళవారం దర్బార్ హాలులో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జీ పీఓ ఖుష్బు గుప్తా ఘనంగా సన్మానించారు. ఉట్నూర్ మోడల్ స్పోర్ట్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్‌లో రాథోడ్ విక్రమ్, ఆత్రం ఉదయ్ కిరణ్, మెస్రం నిఖిల్‌లు ఖోఖో రాంచీ, లక్నోలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పథకం సాధించడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గౌసఆలం, పీఈటీలు యాదవ్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రస్తుత కోర్టు సముదాయాల స్థలంలోనే నూతన భవనాలు నిర్మించాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రస్తుత కోర్టు సముదాయల స్థలంలోనే, జిల్లా నూతన కోర్టు భవనాలు నిర్మించాలని ప్రముఖ న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయంలో తెలంగాణా ప్రభుత్వ న్యాయ వ్యవహారాలు, న్యాయ శాఖ విభాగ ప్రభుత్వ కార్యదర్శి రేండ్ల తిరుపతిని కలిసి నిర్మల్ జిల్లా నూతన కోర్టుల భవన నిర్మాణలు, ప్రస్తుత కోర్టు సముదాయల స్థలంలోనే నిర్మించాలని చర్చించారు. త్వరితగతిన పూర్తి స్థాయి భవన సముదాయాన్ని పూర్తి చేయాలని కోరారు. దానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి సహకరించాలన్నారు. జిల్లా న్యాయవాదుల తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అప్పటికప్పుడు స్పందించిన తెలంగాణా ప్రభుత్వ న్యాయ వ్యవహారాలు, న్యాయ శాఖ విభాగ ప్రభుత్వ కార్యదర్శి రేండ్ల తిరుపతి ఈ విషయాన్ని సంబధిత ఉన్నత అధికారులతో మాట్లాడారని, త్వరలోనే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తానని తెలిపారని వెల్లడించారు. తక్షణమే స్పందించినందుకు వారికి జిల్లా తరపున హృదయ పూర్వక ధన్యావాదాలు తెలిపారు.

## లైంగిక వేధింపులు, దాడి కేసుల వీడియోలు బహిర్గతం చేస్తే చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మహిళలు చిన్నపిల్లలపై జరిగిన లైంగిక వేధింపులకు, అత్యాచార కేసులకు సంబంధించిన వీడియోలను, ఫోటోలను బహిర్గతం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ గౌసఆలం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరూ మహిళలకు సంబంధించిన, చిన్నపిల్లలకు సంబంధించిన, అత్యాచారం లైంగిక వేధింపులకు సంబంధించిన ఎలాంటి వీడియోలను, ఫోటోలను పరస్పరం వాట్సాప్ గ్రూపులలో కానీ సోషల్ మీడియాలో కానీ పోస్ట్ చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఆ గ్రూప్ అడ్మిన్, సభ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అమ్మాయిలు కానీ, అబ్బాయిలు గాని, బాలికల, మహిళల లైంగిక వేధింపులు, లేదా అత్యాచారానికి సంబంధించిన వీడియోలను పేర్లను బహిర్గతం చేయరాదని పేర్కొన్నారు. అలాగే సామాజిక మాధ్యమాలలో మిత్రులకు గాని సంబంధిత గ్రూపులలో గాని పోస్ట్ చేసిన యెడల పోలీసు వ్యవస్థ చట్టపరమైన ఖచ్చితమైన చర్యలను తీసుకుంటుందని చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమేనని అన్నారు. సెక్షన్ 23 పోక్సో చట్టం ప్రకారం ఇలాంటి సున్నితమైన అంశాలలో తల దూర్చిన, ఇలాంటి పనులు చేసినా చట్టం దృష్టిలో శిక్షార్హులని అన్నారు.

## విద్యార్థులను పాఠశాలలకు పంపించాలి



నవతెలంగాణ-కెరమెరి

చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాష్ అన్నారు. మంగళవారం ధనోరలోని ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. 34 మంది విద్యార్థులకు గాను కేవలం 10 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. విద్యార్థుల గైర్హాజరుపై ప్రధానోపాధ్యాయురాలుని ప్రశ్నించగా, సమీపంలోని శివగుడా గ్రామం నుండి 12 మంది విద్యార్థులు పాఠశాలకు రావడంలేదని తెలిపారు. దీంతో నోడల్ అధికారి శివగూడ గ్రామాన్ని సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాల దూరంగా ఉండడంతో పిల్లలను పంపడం కష్టంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. శివగూడలోనే పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్తానని గ్రామస్తులకు నోడల్ అధికారి హామీ ఇచ్చారు. సమస్యలు ఎదురైనా విద్యార్థులను పాఠశాలలకు ప్రతిరోజు హాజరయ్యే చూడాలని తల్లిదండ్రులకు సూచించారు.

## ఈవీఎంల మొదటి విడత పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్

కలెక్టరేట్ సమీపంలో గల గోదాంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల మొదటి విడత పరిశీలనను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం పరిశీలించారు. సియూలు, బియులు, వివిప్యాట్స్‌ను దగ్గరుండి పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, రాజకీయ పార్టీల నాయకులు గాజుల రవి, శ్రావణ్‌రెడ్డి, మజార్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ జన్మదిన వేడుకలను మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువాతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు షేక్ మోబీన్, సూర్యవంశీ శశాంక్ ఉన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు. మండల అధికారులు వారి నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

### పంచాయతీల అభివృద్ధికి

# కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక రత్న గార్డెన్‌లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 468 గ్రామపంచాయతీలకు 184 మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. ఈనెల 2న వీరు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టాలపై ప్రత్యేకాధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంచాయతీ కార్యదర్శుల సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో నిత్యం జరిగే పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాలని అన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త లను వేరువేరుగా సేకరించాలని అన్నారు. హరితహారం కింద నాటిన మొక్కలను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటుపై పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి రెండు నెలలకు జరిగే గ్రామ సభలకు ప్రత్యేకాధికారులు అధ్యక్షత వహించి, ఆదాయ వ్యయాలపై సమీక్షించాలని, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపొందించి (ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్) లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 28 వరకు 100 శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీలలో అక్రమ వెంచర్ల ఏర్పాటుపై దృష్టి సారించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో నిర్వహించాల్సిన ప్రధాన బాధ్యతలను గురించి వివరించారు. అంతకుముందు జిల్లా పంచాయతీ అధికారి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గ్రామపంచాయతీ విధులు, విధానాలపై, ఇరిగేషన్ అధికారులు నీటి క్లోరినేషన్‌పై, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉపాధి హామీ పనుల గురించి అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మిషన్ భగీరథ ఎస్ఈ సురేష్, ప్రత్యేకాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 16న గ్రామీణ బంద్ సమ్మెను విజయవంతం చేయాలి



నిర్మల్‌లో అభివాదం చేస్తున్న వామపక్ష కార్మిక సంఘ నాయకులు

నవతెలంగాణ-నిర్మల్

16న గ్రామీణ బంద్ సమ్మెను విజయవంతం చేయాలని, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. మంగళవారం ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న జరిగే భారత్ బంద్‌ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక మతతత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవనాధాయం పడిపోయి, పేదల సంఖ్య పెరిగిందని, కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి రైతు వ్యతిరేక మూడు చట్టాలను తీసుకువచ్చి బడా కార్పొరేట్ యాజమాన్యాలకు ఉపయోగకరంగా వ్యవహరిస్తుందని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, జాయింట్ ఫ్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగినటువంటి వ్యవసాయ కార్మిక బంద్‌లో 40 వేల కేసులు రైతులపై మోపారని తెలిపారు. 750 మంది రైతులు చనిపోతే వారికి నష్టపరిహారం ఇవ్వకపోగా రైతులకి తీవ్రమైనటువంటి నష్టాన్ని కలిగించే విధంగా చట్టాలను మారుస్తూ నియంత పాలనని కొనసాగిస్తుందని విమర్శించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసాచారి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.లలిత, జిల్లా కమిటీ సభ్యులు కెమెంట్ వేస్లీ, ఐఎఫ్టియూ జిల్లా కార్యదర్శి ఆర్. రామ లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్, నాయకులు ఎం.హరిత, ఎస్ఎన్‌రెడ్డి, పరికిపండ్ల స్వదేశ్, గంగన్న, ఎండిగఫూర్, పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పద్మకుమారి పాల్గొన్నారు.

**కౌటాల :** ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మె నిర్వహించే గ్రామీణ భారత్ బందును విజయవంతం చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మోర్లె నాగేష్, మండల అధ్యక్షురాలు పెరుగు మొగుర, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు కోరారు. మంగళవారం సూపర్‌వైజర్ రేణుకకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మోర్లె నాగేష్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎంకు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ మెనీఫెస్టోలో ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



కౌటలలో సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా వర్కర్లు

# భూసారానికి అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలి



(భీమారం మండలం) ఆరెపల్లి శివారులో మట్టి నమూన సేకరిస్తున్న తిరుపతి

నవతెలంగాణ-జైపూర్

భూసార పరిక్షల ద్వార గుర్తించిన పోషక విలువల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని, దీని ద్వార వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థి ముత్యం తిరుపతి సూచించారు. జగిత్యాల విశ్వవిద్యాలయంలో చివరి సంవత్సరం చదువుతున్న ఆయన సోమవారం భీమారం మండలం ఆరెపల్లి శివారు రైతులకు భూసార పరిక్షలపై అవగాహన కల్పించారు. భూసార పరిక్షల కోసం పంట పొలాల నుండి మట్టి నమూనాలు సేకరించడంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంట పొలంలో ఆరు నుండి తొమ్మిది ఇంచుల లోతుతో ఎకరం భూమిలో నాలుగు నుండి ఐదు ప్రదేశాల్లో వీ ఆకారంలో తవ్వి మట్టిని సేకరించాలన్నారు. ఈ విధంగా సేకరించిన మట్టిని ఒక చోట కుప్పగా పోసి అందులో నుండి అర కిలో పరిమాణంలో గల మట్టిని పరీక్ష కోసం పంపించాలని సూచించారు. వ్యవసాయ కళాశాల ప్రయోగశాలలో సదరు మట్టిని పరీక్షించి పోషకాల లభ్యతతో పాటు సాగుకు అనుమైన పంటలు, వినియోగించాల్సిన ఎరువులను సూచిస్తూ సాయిల్ హెల్త్ కార్డు రూపంలో రైతుకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కాగా మట్టిని పరీక్షించేందుకు రైతు రూ. 150 చెల్లించాల్సి ఉంటుందని, నీటిని పరిక్షించాలంటే రైతు రూ. 100 చెల్లించి సమాచారం పొందవచ్చునని తెలిపారు. ఈ సంధర్భంగా వ్యవసాయ కృషి అనుభవ విద్యార్థులు అక్షర్, మనోజ్‌లు డ్రం సీడర్ విధానంతో సాగు చేసిన వరిలో కలుపు నివారణకు కోనో వీడర్ వినియోగించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కుసుమ పంటలో చీడపీడల నివారణపై రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి శివారు రైతు పెద్దపల్లి తిరుపతి, రాంచందర్, కృష్ణంరాజు, రాములు, లచ్చన్న పాల్గొన్నారు.

## యూడైస్ ప్లస్‌లో నమోదైన విద్యార్థుల రికార్డుల పరిశీలన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని అక్షర హైస్కూల్, మండల ప్రాథమికోన్నత పాఠశాల నర్సాపూర్(డబ్ల్యూ) పాఠశాలల్లో యూడైస్ ప్లస్ వెరిఫికేషన్‌లో భాగంగా మంగళవారం జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, లింబాద్రి సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలో విద్యార్థుల వివరాలు రిజిస్టర్ ప్రకారము ఉందా లేదా అని తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో యూడైస్ ప్లస్‌లో తరగతుల వారీగా క్రోడీకరించాలని తెలియజేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా విద్యార్థుల వివరాలు ఇప్పటికప్పుడు యూడైస్ ప్లస్ అంతర్జాలంలో నమోదు చేసేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది అర్షద్, స్పందన్, సీఆర్పీలు మహేందర్, సుధాకర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెక్కుతో పాటు బంగారం ఇస్తే బాగుండు



నవతెలంగాణ-తాంసి

కళ్యాణలక్ష్మి చెక్కుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన తులం బంగారం ఇస్తే లబ్ధిదారులు ఎంతో సంతోషపడే వారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం భీంపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో 53 కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జెడ్పీటీసీ సుధాకర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరిదాస్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మొదటగా తహసీల్దార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది ఎమ్మెల్యేలను శాలువాతో సన్మానించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారాన్ని అందిస్తామని ప్రకటించారు. కాని బంగారం ఇవ్వడం లేదన్నారు. నిరుపేద కుటుంబాలకు తులం బంగారంతో పాటు కళ్యాణ లక్ష్మి చెక్కు అందిస్తే లబ్ధిదారులతో పాటు మేము కూడా ఎంతో సంతోష పడే వారమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ పథకం కొనసాగుతుందని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం రూ.3లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిపాని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఖాసీం నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింబాజి, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, పార్టీ కన్వీనర్ నాగయ్య, మండల నాయకులు అనిల్, నరేందర్ యాదవ్, మహేందర్, జహీర్, సంజీవ్‌రెడ్డి, ఆఫ్రోజ్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సొంత డబ్బులతో పాఠశాలను నిర్మించిన అభినవ్ సర్దార్

నవతెలంగాణ-సిరికొండ

శ్రీమంతుడు అనే సినిమాలో మహేష్ బాబు ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి ఎలా చేశాడో అలాగే సినిమలాగే సిరికొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం కోసుపటేల్ గూడలో సినీ ఇండస్ట్రీ యువనేత అభినవ్ సర్దార్ తన సొంత డబ్బులతో పాఠశాలను నిర్మించి, విద్యార్థుల కష్టాన్ని తొలగించారు. గత నెల రోజుల కింద ఆ గ్రామాన్ని సందర్శించి, విద్యార్థులు పడుతున్న కష్టాన్ని చూసి చలించిపోయారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలు వణుకుతూ తడకలతో నిర్మించిన పాఠశాల గదిని చూసి తన సొంత డబ్బులతో పాఠశాలను నిర్మించి ఇస్తానని గ్రామస్తులకు మాటిచ్చారు. మాట ఇచ్చిన ప్రకారం గ్రామంలో ఒక పాఠశాల భవన నిర్మాణాన్ని నిర్మించి మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. దీంతో గ్రామస్తులు, పలువురు సంతోషం వ్యక్తం చేశారు. పేద పిల్లల చదువు కోసం పాఠశాల భవనాన్ని నిర్మించి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఏదైనా సమాజం కోసం సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నానని, పేదింటి కష్టాలు ఎలా ఉంటాయో తనకు తెలుసని, ఇంక ఏ విధంగానైనా సహాయం కావాలంటే తనను సంప్రదించాలని అభినవ్ సర్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యాదవ్‌రావ్, జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయుడు ఆత్మరామ్ పాల్గొన్నారు.

## దుకాణాల ఏర్పాటుకు బహిరంగ వేలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్ గాం శివమల్లన్న స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మార్చి 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న జాతరలో వివిధ దుకాణాల ఏర్పాటుకు అధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. గత సంవత్సరం వేలం ద్వారా రూ.10,02,000లు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.19,08,000 వచ్చిందని ఆలయ ఈఓ గర్లెపల్లి వేణుగోపాల్ గుప్త తెలిపారు. రెబ్బెన మండలంలోని గంగాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈఓ బాపురెడ్డి పర్యవేక్షణలో బహిరంగ వేలం పాటలో 24 మంది డిపాజిట్లు చెల్లించి పాల్గొన్నారు. టెంకాయల దుకాణంకు రూ. 2,36,000, ప్రసాదాల విక్రయానికి రూ. 2,03,000, తైబజార్ కు రూ.12,21,000, పాలు, పత్రి దుకాణం ఏర్పాటుకు రూ.91,000, కొబ్బరి ముక్కల విక్రయానికి రూ.18,000లు, వాహనాల పార్కింగ్ స్థలానికి రూ. 1,39,000లు చొప్పున ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఈజ్‌గాం పోలీసులు బందోబస్తు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సునీత, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.